సాక్షి కామారెడ్డి

మంగళవారం ၊ 27 ၊ ఫిబ్రవరి ၊ 2024



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు.

- 8లో ▸



సౌకర్యాలు మెరుగుపరుస్తాం

తెలంగాణ యూనివర్సిటీలో క్రీడా సౌకర్యాలను మెరుగు పరుస్తామని రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం 34.2 /17.7

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

కామారెడ్డి మున్సిపల్ డీఈ, ఏఈల బదిలీ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ ఇంజినీర్ వాసుదేవరావుతో పాటు అసిస్టెంట్ ఇంజినీర్ రవి సోమవారం బదిలీ అయ్యారు. వీరిద్దరు నిజామాబాద్ కార్పొరేషన్‌కు బదిలీ కాగా.. వారి స్థానంలో మెట్‌పల్లి నుంచి డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ శంకర్‌కుమార్ రానున్నారు. రెండు రోజుల్లో వారు విధుల్లో చేరనున్నారు.

బీజేపీతోనే అభివృద్ధి



కామారెడ్డి టౌన్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం రూ. 41 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభించిన సందర్భంగా జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సంబురాలు జరిపారు. ఈ సందర్భంగా అరుణతార మాట్లాడుతూ అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ప్రధాని 554 రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని, 1,500 రైల్వే అండర్ బ్రిడ్జి, ఓవర్ బ్రిడ్జీలను జాతికి అంకితం చేశారని పేర్కొన్నారు. జిల్లాలోని సిద్ధరామేశ్వరనగర్, తిప్పాపూర్, అడ్లూర్, ఉప్పల్‌వాయి వద్ద నిర్మించిన అండర్ బ్రిడ్జీలను జాతికి అంకితం చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే రవాణా వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయడానికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

గణిత ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కుమారస్వామి



కామారెడ్డి టౌన్: తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నీలం కుమారస్వామి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు.

'గృహజ్యోతి అమలుకు సిద్ధంగా ఉన్నాం'

కామారెడ్డి అర్బన్: జిల్లాలో గృహజ్యోతి అమలుకు సిద్ధంగా ఉన్నామని ఎస్‌ఈ రమేశ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో కేటగిరి–1 గృహ వినియోగం కింద 2,35,466 మీటర్లున్నాయని తెలిపారు. గృహజ్యోతికి దరఖాస్తు చేసుకున్నవారిలో 1,33,020 మంది తెల్లరేషన్‌కార్డులు కలిగి ఉన్నారని పేర్కొన్నారు. రేషన్‌కార్డులు లేకుండా 23 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయడానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పైఅధికారులకు సమాచారం ఇవ్వకుండా ఎక్కడా విద్యుత్ కోతలు విధించరాదని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించామని పేర్కొన్నారు.

అయ్యప్ప ఆలయానికి స్వర్ణ ఖడ్గం బహూకరణ



నిజామాబాద్ సిటీ: నగరంలోని కంఠేశ్వర్ అయ్యప్ప ఆలయంలో స్వామివారికి సోమవారం స్వర్ణ ఖడ్గం బహూకరించారు. హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతిస్వామి ప్రత్యేక పూజలు చేసి, స్వామి వారికి స్వర్ణ ఖడ్గం అలంకరించారు. దాతలు విరాళాలుగా అందజేసిన బంగారం, నగదుతో 80 తులాల బంగారంతో స్వర్ణ ఖడ్గం తయారు చేయించారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణలో అతిపెద్ద అయ్యప్ప ఆలయం నగరంలో ఉండటం గర్వకారణమన్నారు. ఆలయం దినదిన అభివృద్ధి చెందుతోందన్నారు. ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామికి బంగారు ఖడ్గాన్ని అలంకరించటం సంతోషకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ దండు నీతూ కిరణ్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, అయ్యప్ప మందిరం అధ్యక్షుడు భక్తవత్సలం నాయుడు, ప్రధాన కార్యదర్శి ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

కారు దిగి హస్తం గూటికి...

- పార్లమెంట్ ఎన్నికల ముందు పెరిగిన వలసలు
- వరుసగా బీఆర్‌ఎస్‌ను వీడుతున్న నేతలు
- నిలువరించలేకపోతున్న గులాబీ నాయకత్వం

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో వలసలు జోరందుకున్నాయి. ప్రధానంగా కారు దిగుతున్న నేతలు.. హస్తం గూటికి చేరుతున్నారు. ప్రజాప్రతినిధులు, సీనియర్ లీడర్లు పార్టీని వీడుతుండడాన్ని బీఆర్‌ఎస్ నాయకత్వం నిలువరించలేకపోతోంది. దీంతో గులాబీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది.

– సాక్షి, కామారెడ్డి



మలిదశ తెలంగాణ ఉద్యమ సమయం నుంచి బీఆర్‌ఎస్‌కు కంచుకోటగా ఉన్న కామారెడ్డి జిల్లాలో పరిస్థితి క్రమంగా మారిపోతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ ఓడిపోవడంతో నేతలు గులాబీ కండువా వదిలేస్తున్నారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో చాలా మంది నేతలు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించాలన్న ఆరాటంతో ఉన్నవారు పార్టీ మారుతున్నట్లు తెలుస్తోంది.

పై'చేయి' కోసం..

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత రెండు సార్లు జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో జహీరాబాద్ స్థానంనుంచి బీఆర్‌ఎస్సే విజయం సాధించింది. అయితే ఈసారి రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ఎలాగైనా జహీరాబాద్ స్థానాన్ని కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో ఉంది. దీంతో బీఆర్‌ఎస్ నుంచి వలసలను ప్రోత్సహిస్తున్నట్టు స్పష్టమవుతోంది. బీఆర్‌ఎస్‌ను బలహీనపర్చడంతో పాటు తమ పార్టీ బలాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా బాన్సువాడలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, కామారెడ్డిలో బీజేపీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో మాత్రమే కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్నారు. అయితే నాలుగు నియోజకవర్గాల్లో మెజారిటీ ఓట్లు సాధించే దిశగా కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే చేరికలను ప్రోత్సహిస్తున్నారని తెలుస్తోంది.

జుక్కల్ నియోజకవర్గంలో...

జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు బీబీ పాటిల్ సొంత ప్రాంతమైన జుక్కల్ నియోజకవర్గంలోనూ బీఆర్‌ఎస్ నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. పిట్లం, నిజాంసాగర్, జుక్కల్, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, మద్నూర్, డోంగ్లీ, మహ్మద్‌నగర్ మండలాల్లోని పలువురు నేతలు ఇప్పటికే ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావుతో సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో...

ఎన్నికలకు ముందు లింగంపేట జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎల్లారెడ్డి ఎంపీపీ మాధవి తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఇటీవల గాంధారి మండలానికి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. తాడ్వాయి మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి హస్తం గూటికి చేరారు. ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాలకు చెందిన పలువురు నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు సైతం ఇదే దారిలో పయనిస్తున్నారు. ఇలా ఒక్కరొక్కరుగా పార్టీని వీడుతున్నా.. వలసలను నివారించడంలో గులాబీ నాయకత్వం విఫలమవుతోంది. పార్లమెంట్ ఎన్నికల సమయానికి పరిస్థితి ఇంకెలా ఉంటుందోనన్న చర్చ రాజకీయ వర్గాలలో నడుస్తోంది.

'పోచారం' ఇలాఖాలో...

బాన్సువాడ నియోజకవర్గంలోనూ బీఆర్‌ఎస్‌కు ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన పాత బాలకృష్ణ, వ్యాపార వేత్త శ్రీనివాస్‌రావు, పలువురు మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కోటగిరి, వర్ని మండలాలకు చెందిన పలువురు ముఖ్య నేతలు కూడా అధికార పార్టీలో చేరారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన నాయకులు పార్టీని వీడుతుండడం చర్చనీయాంశంగా మారింది. పోచారం తనయుడు భాస్కర్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి ఎంపీగా పోటీ చేయాలని ఆరాటపడుతున్న సమయంలో ఆయన నియోజకవర్గంలోనే ఇలాంటి పరిస్థితి ఉండడం ఆ పార్టీ శ్రేణులను కలవరానికి కృషి చేస్తోంది.

కామారెడ్డి నియోజక వర్గంలో..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు మొదలైన వలసలు ఇటీవల ఊపందుకున్నాయి. ఎన్నికల సమయంలో భిక్కనూరు ఎంపీపీ గాల్‌రెడ్డి, దోమకొండ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందుప్రియ, పలువురు కౌన్సిలర్లు, నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. తర్వాత బల్దియాలో సగానికిపైగా బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మరికొందరు అదే బాటలో ఉన్నట్టు తెలుస్తోంది. ఇటీవల భిక్కనూరు మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య, మాజీ సర్పంచ్ నర్సింలుయాదవ్, మాజీ ఎంపీటీసీ బాల్‌నర్సవ్వ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మాచారెడ్డి మండలానికి చెందిన సహకార సంఘం వైస్ చైర్మన్, సభ్యులంతా మూకుమ్మడిగా కాంగ్రెస్‌లో చేరిపోయారు. దోమకొండ, బీబీపేట, రాజంపేట, కామారెడ్డి మండలాలకు చెందిన పలువురు నేతలూ అదే దారిలో నడుస్తున్నారు.

రాష్ట్రం పచ్చగా ఉండాలి



వర్ని ఎంపీపీ లక్ష్మీవీర్రాజును కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి తుమ్మల, ఏనుగు రవీందర్‌రెడ్డి

- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలాగా పాడి పంటలతో శోభిల్లాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బాన్సువాడ: పచ్చని, పాడిపంటలకు నిలయమైన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాదిరిగానే తెలంగాణ మొత్తం ఉండాలని తన కోరికని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం బాన్సువాడలోని మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి క్యాంపు ఆఫీస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు. వర్ని ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు, వకీల్‌ఫారం, కూనిపూర్, జలాల్‌పూర్, సిద్దాపూర్ గ్రామాల తాజా మాజీ సర్పంచ్‌లు భూలక్ష్మి వెంకట్రావ్, శశికళ, అనిత వెంకట్‌గౌడ్, కల్యాబాయి దశరథ్‌లు వారి అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ వ్యవసాయంలో ఉన్న సంతృప్తి ఎందులోనూ దొరకదన్నారు. మన వృత్తి, ప్రవృత్తి వ్యవసాయమేనని, దాన్ని వదిలిపెట్టవద్దని కోరారు. అమెరికాలో ఉండే ఐటీ ఉద్యోగుల్లో సైతం తెలంగాణకు వచ్చి వ్యవసాయం చేయాలనే భావన కలుగుతోందన్నారు. వ్యవసాయం చేసే రైతులను దేవుడిలా చూసుకుంటామన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అసంబద్ధ కార్యక్రమాలు, పొరపాట్ల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఒడిదొడుకుల్లో ఉందన్నారు. అయినా ఏమాత్రం ఇబ్బంది లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. రైతులు హార్టికల్చర్‌పై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు యలమంచలి శ్రీనివాస్‌రావు, కూనిపూర్ రాజిరెడ్డి, మైలారం భాస్కర్‌రెడ్డి, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజ్ పాటిల్, మోరిల్ శ్రీనివాస్‌రావు, మధుసూదన్‌రెడ్డి, నార్ల రఘు, కాట్రోత్ రూప్‌సింగ్, వెంకటరమణరావు, శ్రావణి దేవేందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు..

బాన్సువాడ: బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు కండువా మార్చేశారు. సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి నివాసంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో కాంగ్రెస్ చేరారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ప్రధాన అనుచరుడు, ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పాత బాలకృష్ణతో పాటు కౌన్సిలర్లు రమాదేవి, రుక్మిణి గైక్వాడ్, బాడి శ్రీనివాస్, అహ్మద్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి తనయుల వ్యవహార శైలి నచ్చక ఈ నిర్ణయం తీసుకున్నామని కాంగ్రెస్‌లో చేరిన నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన వ్యాపారవేత్త మోరిల్ శ్రీనివాస్, నాయకులు మైలారం భాస్కర్‌రెడ్డి, అంజద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి తుమ్మల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు, నాయకులు

కార్యకర్తలు అధైర్యపడొద్దు





పద్మాజీవాడి చౌరస్తా వద్ద మాట్లాడుతున్న ఎంపీ బీబీ పాటిల్, సిద్దరామేశ్వర ఆలయంలో పూజలు

- భవిష్యత్తు బీఆర్‌ఎస్‌దే..
- జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్

సదాశివనగర్: బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధైర్య పడొద్దని, భవిష్యత్తు మనదేనని ఎంపీ బీబీ పాటిల్ పేర్కొన్నారు. సోమవారం బాన్సువాడకు వెళ్తూ మార్గమధ్యలో పద్మాజీవాడి చౌరస్తాలో ఆగి పార్టీ నాయకులతో మాట్లాడారు. కార్యకర్తలకు ఏదైనా సమస్య ఎదురైతే ఫోన్ ద్వారా తెలిపితే వెంటనే పరిష్కరిస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సూచన మేరకు ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి రూ. 50 లక్షల నిధులు మంజూరు చేశానన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓడిపోయినంత మాత్రాన కార్యకర్తలు, నాయకులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రానున్న కాలంలో బీఆర్‌ఎస్‌కు మంచి రోజులు వస్తాయన్నారు. భూంపల్లి అంబరీశుడి గుడి నిర్మాణం కోసం ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. పద్మాజీవాడి చౌరస్తా వద్ద జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని బీఆర్‌ఎస్ నాయకుడు నర్సారెడ్డి, మోడెగాం అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని లోక పెద్ద రాజిరెడ్డి ఎంపీని కోరారు. రామారెడ్డి ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, ఎంపీటీసీ రాజేందర్, అంబరీశ్వర ఆలయ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి, విఠల్‌రావు, రమేశ్, గొల్ల శంకర్, ఆనంద్‌రావు, అంజల్‌రెడ్డి, లింగం తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేందుకు కృషి చేస్తా

భిక్కనూరు: భిక్కనూరు రైల్వేస్టేషన్‌లో అన్ని సౌకర్యాలు కల్పించి, ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చర్యలు తీసుకుంటామని ఎంపీ బీబీపాటిల్ పేర్కొన్నారు. సోమవారం సిద్దరామేశ్వర ఆలయ సమీపంలో గల బ్రిడ్జిని ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించగా ఎంపీ పాల్గొన్నారు. అనంతరం బ్రిడ్జిని పరిశీలించారు. సిద్దరామేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. ఎంపీటీసీ బండి చంద్రకళ, మాజీ సర్పంచ్ వేణు, సొసైటీ ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, వెంకట సుబ్బారావ్, బసవయ్య, మహేందర్‌రెడ్డి, దుర్గారెడ్డి, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సాయాగౌడ్ పాల్గొన్నారు.

3న పల్స్ పోలియో



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

- వంద శాతం చిన్నారులకు చుక్కల మందు వేయించాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: పల్స్ పోలియో కార్యక్రమాన్ని మార్చి 3న నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. కార్యక్రమ నిర్వహణపై కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలన్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 733 చోట్ల ప్రత్యేక బృందాలతో పోలియో చుక్కలు వేసే కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మరో 48 సంచార బృందాలను కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లాలో దాదాపు 1,02,555 మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉంటారన్నారు. ఐసీడీఎస్ అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పోలియో చుక్కలు వేయించడంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేలా చూడాలని అధికారులకు సూచించారు. డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, ఇమ్యూనైజేషన్ అధికారి అనిల్, ఐసీడీఎస్ పీడీ బావయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, బీసీ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, పరిశ్రమల అధికారి లాలూనాయక్, ఆర్టీసీ డీఎం ఇందిర పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలి

కామారెడ్డి క్రైం: డిజిటల్ లావాదేవీలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. రిజర్వు బ్యాంకు ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లను కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యావంతులు కూడా కొన్ని సందర్భాల్లో సైబర్ నేరాలకు గురవుతున్నారన్నారు. ఆర్థిక నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎల్‌డీఎం భార్గవ సుధీర్, డీఈవో రాజు పాల్గొన్నారు.

పది పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షల కోసం సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో డీఈవో రాజు, పరీక్షల విభాగం సహాయ కమిషనర్ లింగం, చీఫ్ సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

కరెంట్ కోతలకు చెక్!

- వేసవిలో పెరగనున్న విద్యుత్ వినియోగం
- అదనపు భారాన్ని అధిగమించేందుకు ట్రాన్స్‌కో చర్యలు
- ఎక్కడా సమస్య తలెత్తకుండా చూస్తామంటున్న అధికారులు



ట్రాన్స్‌కో అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఎస్‌ఈ రమేశ్

సాక్షి, కామారెడ్డి: క్రమంగా ముదురుతున్న ఎండలతో జిల్లాలో కరెంట్ వినియోగం పెరుగుతోంది. భానుడి ప్రభావం పూర్తిస్థాయిలో ప్రారంభం కాకముందే ఉక్కపోత మొదలైంది. జిల్లాలోని చాలా చోట్ల ఏసీలు, కూలర్ల వినియోగం మొదలైంది. దీంతో వేసవిలో తలెత్తే అధికలోడ్, కరెంట్ కోతల సమస్యలను అధిగమించేందుకు ట్రాన్స్‌కో అధికారులు 'నో పవర్ కట్' అనే నినాదంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టేందుకు సన్నద్ధమయ్యారు. సాధారణ రోజుల్లో జిల్లావ్యాప్తంగా 49లక్షల యూనిట్ల విద్యుత్‌ను వినియోగించగా శనివారం ఒక్కరోజే 64.34 లక్షల యూనిట్లకు పెరిగింది. ఈ క్రమంలో వేసవిలో జిల్లావ్యాప్తంగా ఎక్కడా కూడా విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తకుండా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ట్రాన్స్‌కో ఎస్‌ఈ రమేశ్‌బాబు జిల్లాలోని ట్రాన్స్‌కో డీఈఈ, ఏడీఈ, ఏఈల తోపాటు క్షేత్రస్థాయిలోని ఉద్యోగులతో వారం రోజులుగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో సిబ్బందికి ఆయన దిశానిర్దేశం చేశారు. ముందస్తు సమాచారం లేకుండా ఎక్కడైనా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు చేపట్టనున్నట్లు ఆయన హెచ్చరించారు.

ఓవర్ లోడ్ విద్యుత్ కేంద్రాల గుర్తింపు

వేసవి మొదలు కావడంతో జిల్లాలో వారం రోజులుగా విద్యుత్ వినియోగంపై ట్రాన్స్‌కో అధికారులు దృష్టి సారించారు. దీనిలో భాగంగా జిల్లాలోని విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వారీగా అదనపు విద్యుత్ వినియోగానికి సంబంధించి సమాచారాన్ని సేకరించారు. 135 కేవీ, 33/11కేవీ సబ్‌స్టేషన్లలో అవసరమైనచోట్ల అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను బిగించేందుకు కార్యాచరణను రూపొందించారు. ఓవర్‌లోడ్ సమస్యను అధిగమించేందుకు అవసరమున్న ప్రాంతాల్లో మరో 15రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం జిల్లాలోని ఆరేపల్లి, అన్నారం, ఎల్లంపేట, మేనూర్ సబ్‌స్టేషన్లలో ఓవర్‌లోడ్ సమస్య ఉన్నట్లు గుర్తించారు. ఆయా సబ్‌స్టేషన్లలో అదనంగా 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు.

పేదల జీవితాల్లో వెలుగులే లక్ష్యం

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. అనంతరం టీఎన్‌జీవోస్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించడంలో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగ జేఏసీ ప్రతినిధులు కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని, 317 జీవో పునః సమీక్షించుటకు కమిటీ వేశామన్నారు. ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వర్తించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యురాలు డ్యూటీకి డుమ్మా కొట్టి, హాజరైనట్లు సంతకాలు చేసినట్లు పత్రికల్లో కథనాలను చూశానని అన్నారు. అలాంటి పనులు చేస్తూ చెడ్డ పేరు తీసుకురావద్దని సూచించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ ఉద్యోగులు సమష్టిగా పనిచేసి జిల్లాను అన్ని రంగాల్లో మొదటి స్థానంలో ఉండే విధంగా చూస్తున్నారని కొనియాడారు. షబ్బీర్ అలీని టీజీవో, టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దేవేందర్, కార్యదర్శి సాయిరెడ్డి, టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, బి సాయిలు, ఉమ్మడి జిల్లా సమన్వయ కర్తలు అలుక కిషన్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రతినిధులు సుంకరి భూమయ్య, నీలం లింగం, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరీక్ష కేంద్రం తనిఖీ



భిక్కనూరు : మండల పరిధిలో ఉన్న తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదటి సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ కేంద్రాన్ని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ అరుణ సోమవారం తనిఖీ చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. సోమవారం జరిగిన మూడో పేపర్ పరీక్షకు 166 మంది విద్యార్థులకు గాను 157 మంది హాజరయ్యారు. 9 మంది గైర్హాజరయ్యారు. ఆమె వెంట సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ సుధాకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మెట్ల బావికి పూర్వవైభవం తేవాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని కల్యాణి గ్రామంలో ఉన్న గుండ్లోళ్ల మెట్ల బావికి పూర్వవైభవం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పురాతన బావులను అధికారులు పర్యాటక కేంద్రాలుగా మార్చడంతో పాటు వాటికి మరమ్మతులు చేయిస్తున్నారు. గ్రామంలో ఉన్న పురాతన మెట్ల బావికి సైతం పూర్వవైభవం కల్పించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

250 సెల్‌ఫోన్లను రికవరీ చేశాం



బాన్సువాడ రూరల్ : సీఈఐఆర్ పోర్టల్ ద్వారా బాన్సువాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు పోగొట్టుకున్న 250 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. సోమవారం డీఎస్పీకార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. సెల్‌ఫోన్ల రికవరీలో బాన్సువాడ పోలీస్‌స్టేషన్ ముందంజలో ఉందని సీఐ కృష్ణ, ఆపరేటర్ రాజేశ్వర్‌ను అభినందించారు. రికవరీ చేసిన ఫోన్లలో రెండింటిని దుబాయ్, నేపాల్ నుంచి తెప్పించామని, మరో 20 ఫోన్లను 11 రాష్ట్రాల నుంచి తెప్పించి బాధితులకు అప్పగించామన్నారు. సోమవారం నలుగురు బాధితులకు సెల్‌ఫోన్లను అప్పగించారు.

ఇంటర్ వర్సిటీ క్రికెట్‌లో సత్తా చాటాలి



భిక్కనూరు : తెలంగాణ విశ్వవిద్యాలయం ప్రధాన క్యాంపస్‌లో ఇంటర్ వర్సిటీ టోర్నీ సెలక్షన్స్ కోసం సౌత్‌క్యాంపస్ విద్యార్థులు తరలివెళ్లారు. సెలక్షన్స్‌కు వెళ్తున్న విద్యార్థుల ర్యాలీని స్పోర్ట్స్ ఇన్‌చార్జి డాక్టర్ భూక్యా వీరభద్రం జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్‌గౌడ్, డాక్టర్ నారాయణ, ఏపీఆర్వో సరిత పాల్గొన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- ప్రజావాణికి 50 వినతులు



ప్రజావాణిలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం/కామారెడ్డి టౌన్: ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 50 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఆస్తి తగాదాలకు సంబంధించిన ఫిర్యాదుదారులు కోర్టులను ఆశ్రయించాలని సూచించారు. కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్ , సూపరిండెంట్ ప్రేమ్‌కుమార్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఓటింగ్ విధానంపై అవగాహన

కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవీఎం ప్రదర్శన కేంద్రంలో ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ప్రజావాణికి వచ్చిన ప్రజలకు ఓటింగ్ యంత్రాలు, వాటి వినియోగం, ఓటు వేసే విధానాలపై అధికారులు డెమో ప్రదర్శన ద్వారా వివరించారు.

ఆరు నెలల బిల్లులు చెల్లించాలి

జిల్లాలోని ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వెల్ఫేర్ హాస్టళ్లకు సరఫరా చేసే గుడ్లు, కిరాణా, కూరగాయల బిల్లులను తక్షణమే చెల్లించాలని ఏజెన్సీల నిర్వాహకులు కలెక్టర్‌ను కోరారు. ఆరు నెలలుగా బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి సరుకులు సరఫరా చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీకి సైతం వినతిపత్రం అందజేశారు.



కలెక్టర్‌కు విన్నవిస్తున్న ఏజెన్సీల నిర్వాహకులు

పెండింగ్ వేతనాల కోసం ధర్నా



పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, తెలంగాణ అంగన్‌వాడి టీచర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. 3 నెలల వేతనాలతో పాటు గతేడాది సమ్మె కాలం వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అన్ని బకాయిలు, వేతనాలు చెల్లించే వరకు ఎలాంటి రిపోర్టులు కానీ, సర్వేలు, పల్స్ పోలియో కార్యక్రమ విధులు నిర్వహించబోమని తేల్చి చెప్పారు. అనంతరం ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కల్పన, బాబయి, యాదమ్మ, దేవకరుణ పాల్గొన్నారు.

కల్తీ కల్లు విక్రయదారులపై చర్యలు తీసుకోవాలి



జిల్లాలో కల్తీ కల్లు విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. నిషేధిత మత్తు పదార్థాలు కల్లులో కలిపి ప్రజలను మత్తుకు బానిసలుగా మార్చి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్యాయత్నం



సుభాష్‌నగర్ : నిజామాబాద్ కలెక్టరేట్ ప్రధాన గేటు ఎదుట కామారెడ్డి జిల్లా జుక్కల్ మండల కేంద్రానికి చెందిన ఎస్‌కే సమద్ కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఎస్‌కే సమద్ కొంతమందిని తీసుకుని సదరం సర్టిఫికెట్ల కోసం నిజామాబాద్ కలెక్టరేట్‌కు వచ్చాడు. ప్రధాన గేటు వద్ద పేర్లు నమోదు చేసుకునే సమయంలో తమది కామారెడ్డి జిల్లా అని చెప్పడంతో, అక్కడి కలెక్టరేట్‌కు వెళ్లాలని సిబ్బంది సూచించారు. తాను ఇక్కడే అధికారులను కలుస్తానని సమద్ మొండికేశాడు. సిబ్బంది లోనికి అనుమతించకపోవడంతో ఒంటిపై కిరోసిన్ పోసుకున్నాడు. పోలీసులు గమనించి అడ్డుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సమద్‌ను ఇంటికి పంపించారు.

క్రీడాసౌకర్యాల మెరుగుకు కృషి

- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి
- తెయూలో అంతర్ కళాశాలల క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రిజిస్ట్రార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్ క్రీడామైదానంలో వర్సిటీ అంతర్ కళాశాలల ఉమెన్ క్రికెట్ టోర్నమెంట్‌ను రిజిస్ట్రార్ ఎం యాదగిరి సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీలో క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడాసౌకర్యాలను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. చదువుతోపాటు క్రీడాపోటీలపై ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, వర్సిటీ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డైరెక్టర్ జి బాలకిషన్, చీఫ్ వార్డెన్ మహేందర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ బీఆర్ నేత తదితరులు పాల్గొన్నారు. టోర్నమెంట్‌లో 12 జట్లు పాల్గొంటున్నాయని, ఈ నెల 29వరకు టోర్నీ కొనసాగుతుందని డైరెక్టర్ బాలకిషన్ తెలిపారు.

మండుటెండ నుంచి మనవరాలికి రక్షణ



బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నగరంలోని గౌతమ్‌నగర్ సెక్టార్‌కు చెందిన అంగన్‌వాడీ ఆయా హన్మాబాయి తన మనవరాలితో కలిసి ధర్నాకు వచ్చింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పక్కనే ఉన్న చెట్టు వద్దకు చేరి మనవరాలికి రక్షణ కల్పించింది. మంచి నీళ్లు తాగించి ఎండబారి నుంచి కాపాడుకుంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

చిగురించిన ఆశలు

- త్వరలోనే 'ధరణి' సమస్యలకు పరిష్కారం!



నిజామాబాద్ రూరల్: జిల్లాలోని నిజామాబాద్ రూరల్ మండలం బర్దిపూర్ గ్రామానికి చెందిన శంకర్ అనే వ్యక్తికి గ్రామ శివారులో నాలుగు ఎకరాల పట్టా భూమి ఉంది. 2018లో ఆ భూమిని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ నూతన పట్టాపాస్ పుస్తకం ఇచ్చారు. ఆ ఒక్క సర్వే నంబర్‌లో సుమారు 13 ఎకరాల భూమి ఉండగా, అందులో శంకర్ అనే వ్యక్తి భూమి మాత్రమే ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ పట్టాపాస్‌పుస్తకం ఇచ్చారు. తప్పును సరి చేయాలని కోరుతూ శంకర్ తహసీల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నాడు. ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న రైతులెందరో జిల్లాలో ఉన్నారు. వేల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

భూ సమస్యలకు పరిష్కారం చూపించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ధరణికారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల్లో ఆశలు చిగురించాయి. వీలైతే చట్ట సవరణ చేయడం, లేదంటే కొత్త చట్టం తీసుకువచ్చి రైతులకు న్యాయం చేయాలనే ఆలోచనలో రేవంత్‌రెడ్డి ఉన్నారు. ఇందులో భాగంగా తహసీల్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటుకోసం అధికారులకు ఆదేశాలు సైతం జారీ చేశారు. ధరణి పోర్టల్ కారణంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం లభిస్తుంది? రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిరోజుల్లో కార్యాచరణను అమలు చేస్తుందని రైతులు ఎదురుచూస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం

ఒకే సర్వే నంబర్‌లో కొందరికి పట్టాభూమిగా, మరికొందరికి ప్రభుత్వ భూమిగా పట్టాలు జారీ అయితే క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను అధికారులకు పంపుతాం. ఆ తరువాత అధికారుల ఆదేశాల ప్రకారం తప్పులను సవరిస్తాం.

– అనురుధ్, తహసీల్దార్, నిజామాబాద్ రూరల్

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు జయప్రదం చేయాలి

- అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిజామాబాద్ అదనపు కలెక్టర్, ఎల్‌డీఎం

సుభాష్‌నగర్: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం నుంచి మార్చి 1 వరకు నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. వారోత్సవాలను పురస్కరించుకుని లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 'మేక్ ఎ రైట్ స్టార్ట్ – బి కమ్ ఫైనాన్షియల్లీ స్మార్ట్' అనే థీమ్‌తో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. వారోత్సవాల్లో భాగంగా ఈనెల 27న పాత కలెక్టరేట్ మైదానం నుంచి ప్రగతి హాస్పిటల్ వరకు 2కే నడక, 28న ఆర్థిక అక్షరాస్యత శిబిరం, 29న అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులతో సమావేశమై ఆర్థిక అక్షరాస్యత ప్రాముఖ్యతపై ప్రసంగాలు, కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. అదనపు కలెక్టర్ (యూటీ) కిరణ్మయి, జెడ్పీ సీఈవో ఉషా పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖను మరింత పటిష్టం చేస్తాం

- ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి
- రెవెన్యూ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, కలెక్టర్ హనుమంతు

సుభాష్‌నగర్: ప్రభుత్వ కార్యక్రమాల అమలులో క్రియాశీల పాత్ర పోషిస్తూ నిరంతరం ప్రజల సేవలో నిమగ్నమయ్యే రెవెన్యూ శాఖను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం డైరీ, క్యాలెండర్‌ను కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎమ్మెల్యేలు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రితోపాటు రెవెన్యూ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. ముఖ్యంగా దూర ప్రాంతాలకు బదిలీ అయిన వీఆర్ఏలకు సొంత జిల్లాలో పోస్టింగ్ కల్పించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇతర శాఖల్లో నియమితులైన వీఆర్వోలను మళ్లీ రెవెన్యూశాఖలో సర్దుబాటు చేయాలని సీఎంను కోరుతామన్నారు. ఉద్యోగులు సైతం అంకితభావంతో పనిచేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. జిల్లా యంత్రాంగం ద్వారా అమలు చేసే కార్యక్రమాల్లో రెవెన్యూ శాఖకు చెందిన ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందన్నారు. ఏ కార్యక్రమమైనా సమర్థవంతంగా అమలు కావాలంటే రెవెన్యూ శాఖ తోడ్పాటు అవసరమవుతుందన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల్లో తమ పరిధిలోని వాటిని సత్వరమే పరిష్కరిస్తామన్నారు.

ఉద్యోగుల సంఘం సేవలు భేష్

– ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్

రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థను నెలకొల్పి సేవలందించడం అభినందనీయమని ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పేద కుటుంబాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు వైద్య విద్యనభ్యసించేందుకు తోడ్పాటునందిస్తున్నదని, తనవంతుగా కూడా రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తానని ప్రకటించారు.

ఈ సందర్భంగా రెవె న్యూ ఉద్యోగుల సంఘం బాధ్యులు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, అసోసియేషన్, జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రమణ్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, వేణు, శ్రీనివాసరావు, నాగార్జున, ప్రభు, శ్రీధర్, శశి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: ఎస్సీ స్టడీ సెంటర్‌లో గ్రూప్స్, పోటీ పరీక్షలకు సంబంధించిన ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సాంఘికసంక్షేమ శాఖ అధికారిణి శశికళ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు నిజామాబాద్ నగరంలోని నాందేవ్‌వాడలో ఐదు నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్, ఎస్ఎస్‌సీ అర్హత పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మార్చి 6వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని, 10న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ప్రవేశపరీక్ష మార్కుల ఆధారంగా 100 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు ప్రకటనలో తెలిపారు.

వైద్యారోగ్యశాఖలో ఖాళీల భర్తీకి..

నిజామాబాద్‌నాగారం: ఆర్‌బీఎస్‌కే, నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో మెడికల్ ఆఫీసర్స్, డెంటల్ టెక్నిషియన్, సైకాలజిస్ట్ పోస్టులను కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి సుదర్శనం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈనెల 27 నుంచి మార్చి 2వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో జిల్లా కలెక్టర్ వెబ్‌సైట్ nizamabad. telangana. gov. in ద్వారా నిర్ణీత తేదీల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తు చేయాలని, అనంతరం దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసి వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ (పురుష) 3, మెడికల్ ఆఫీసర్ (స్త్రీ) 8, సైకాలజిస్ట్ 1, డెంటల్ టెక్నిషియన్ 1 పోస్టును భర్తీ చేయనున్నట్లు ప్రకటనలో వివరించారు.

ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు..

నేషనల్ హెల్త్ మిషనర్ ద్వారా ఖాళీగా ఉన్న మిడ్ లెవల్ హెల్త్ ఆఫీసర్ (ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టులను కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు వైద్యారోగ్యశాఖాధికారి సుదర్శనం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 నుంచి మార్చి 2వ తేదీ వరకు nizamabad. telangana. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అనంతరం దరఖాస్తులను డౌన్‌లోడ్‌చేసి వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

మద్యం మత్తులో ఆత్మహత్య

నవీపేట: మండలంలోని నాగేపూర్‌కు చెందిన బోడిగం రాజు (39) మద్యం మత్తులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ సోమవారం తెలిపారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన రాజు 20ఏళ్ల క్రితం నాగేపూర్‌కు ఇల్లరికం వచ్చాడు. తాగుడికి బానిసైన రాజు మద్యం మత్తులో ఆదివారం రాత్రి ఇంట్లోని దూలానికి ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఆరోగ్యం సహకరించడంతోపాటు ఆర్థిక ఇబ్బందులను తాళలేక జీవితంపై విరక్తి చెంది మండలంలోని క్రిష్ణాజీవాడికి చెందిన అక్కెలింగం(46) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై సంజీవులు తెలిపిన వివరాల ప్రకారం.. హమాలీ పని చేసుకొని జీవించే లింగం కొన్నినెలల క్రితం పక్షవాతం బారినపడ్డాడు. ఆరోగ్యం సహకరించకపోవడం, ఆర్థిక ఇబ్బందులు ఎక్కువకావడంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో సోమవారం రాత్రి ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.



లింగం (ఫైల్)

భూమి కబ్జా చేసిన వ్యక్తులపై కేసు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రామేశ్వరపల్లి శివారులో భూమిని కబ్జా చేసిన ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

హైదరాబాద్‌కు చెందిన రిటైర్ట్ డిప్యూటీ కలెక్టర్ రామ్‌గోపాల్‌రావు 2008లో 4.20 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమి పక్కనే వెంచర్ చేస్తున్న శ్రీనివాస్‌తోపాటు మరో నలుగురు తన భూమిని కబ్జా చేస్తున్నారని బాధితుడు ఫిర్యాదు చేయగా, ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎమ్మెల్యే కాన్వాయి, ఆటో ఢీ

రుద్రూర్: బోధన్ ఎమ్మెల్యే కాన్వాయిలోని కారు, ఆటో మండలంలోని లింగంపల్లి శివారులో సోమవారం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. కోటగిరి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు బోధన్ ఎమ్మెల్యే వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న ఆటో, కాన్వాయిలోని కారు ఢీకొన్నాయి. కారులో ఉన్న ఇద్దరితోపాటు ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గాయాలపాలైన వారిని చికిత్స నిమిత్తం బోధన్ ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ భూక్యా సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

గుజరాత్ వర్క్‌షాప్‌లో జిల్లా ఉపాధ్యాయులు

కామారెడ్డి టౌన్ : గుజరాత్ రాష్ట్రంలోని ఐఐటీ గాం. దీనగర్, సెంటర్ ఫర్ క్రియేటివ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ వర్క్‌షాప్‌కు జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గణితం, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు ఎన్.శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, టి.శ్రీనివాస్‌లు వారి ప్రాజెక్ట్‌లను ఈనెల 28 తేదీ నుంచి ప్రదర్శించనున్నట్లు వారు తెలిపారు.

ఆరుగురిపై ఫోర్జరీ కేసు నమోదు

ఎడపల్లి(బోధన్): ఫోర్జరీ సంతకాలు చేసి న్యాయస్థానంలో సమర్పించిన రికార్డులను తారుమారు చేసిన ఆరుగురిపై కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ సోమవారం తెలిపారు. ఆర్థికలావాదేవీలకు సంబంధించిన కేసులో ఎడపల్లికి చెందిన పోల మల్కారెడ్డి , రాజేందర్‌గుప్తా, ఆకుల శ్రీనివాస్, ఎక్లూరి శివరాంప్రసాద్, కుర్నాపల్లికి చెందిన సిల్వర్ శంకర్‌గౌడ్, పటాన్‌చెరుకు చెందిన సున్నం రంగయ్య ఫోర్జరీ సంతకాలు చేసి న్యాయస్థానంలో తప్పుడు రికార్డులను సమర్పించినట్లు తేలడంతో సెక్షన్ 193, 465 కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ దహనం

నవీపేట: మండల కేంద్రానికి చెందిన యువకుడు సాయిలు క్షణికావేశంలో తన బైక్‌ను దహనం చేసుకున్నాడని గ్రామస్తులు తెలిపారు. డబ్బుల విషయంలో తన బావతో సాయిలుకు గొడవ జరుగగా, సాయిలు క్షణికావేశంలో తనబైక్‌ను తానే పెట్రోల్ పోసి దహనం చేశాడని స్థానికులు తెలిపారు.

క్రైం కార్నర్

ఖతార్‌లో ఘన్‌పూర్‌తండా వాసి మృతి


- పనిలో చేరిన మొదటిరోజే రోడ్డు ప్రమాదం



గంగావత్ చందర్ (ఫైల్)

రామారెడ్డి: బతుకుదెరువు కోసం ఖతార్‌కు వెళ్లిన కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం రెడ్డిపేట జీపీ పరిధిలోని ఘన్‌పూర్‌తండాకు చెందిన గంగావత్ చందర్(38) అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉపాధి నిమిత్తం కొద్దిరోజుల క్రితం ఖతార్‌కు వెళ్లిన చందర్ ఐదురోజులపాటు స్నేహితులతో కలిసి ఉన్నాడు. పనిలో చేరిన మొదటిరోజే అతడు అదృశ్యం కావడంతో స్నేహితులు గల్ఫ్ సమితి బృందం సహకారంతో చందర్ ఆచూకీ కోసం వెతికారు. అనుమానంతో ఆస్పత్రుల్లో వెతుకగా ఫిబ్రవరి 5వ తేదీన రోడ్డు ప్రమాదంలో చందర మృతి చెందినట్లు వారికి తెలిసింది. తెలంగాణ గల్ఫ్ సమితి అధ్యక్షుడు మైదం మధు ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని గుర్తించి, కంపెనీ యాజమాన్యానికి సమాచారం అందించారని తండా వాసులు తెలిపారు. చందర్ మృతదేహాన్ని ఘన్‌పూర్‌తండాకు రప్పించాలని కాంగ్రెస్ నాయకుడు ధన్‌సింగ్‌నాయక్, కుటుంబసభ్యులు సోమవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని, జిల్లా కలెక్టర్‌ను కలిశారు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు పిల్లలున్నారు.

బ్యాక్‌వాటర్‌లో గల్లంతైన బాలుడు..



మహేశ్ మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): చేపలు పట్టేందుకు వెళ్లి నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో గల్లంతైన బాలుడు లైన్ మహేశ్(15) మృతి చెందినట్లు స్థానికులు సోమవారం తెలిపారు. శనివారం సాయంత్రం బ్యాక్ వాటర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లిన మహేశ్ నీటిగుంతలో పడి గల్లంతయ్యాడు. జాలరులు మహేశ్ కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం మహేశ్ మృతదేహం నీటిపై తేలడంతో గ్రామస్తులు మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.